సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం 2 మార్చి 2023



శ్రీవారి ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం వంగల వెంకట్రావు రూ. 1,01,116, బలుసు పుల్లయ్య రూ. 1,01,116 విరాళంగా అందజేశారు.



హుండీ లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): సోమేశ్వర జనార్ధన స్వామికి 97 రోజులకు కానుకలను లెక్కించారు. మొత్తం రూ.11,40,352ల నగదు వచ్చిందని ఈఓ తెలిపారు.



రైల్వేగేటు మూసివేత

పాలకోడేరు: మోగల్లు–కట్టావారిపాలెం మధ్య రైల్వేగేటు మరమ్మత్తుల నిమిత్తం ఈ నెల 1 నుంచి 4 సాయంత్రం వరకూ మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రసాద్

నరసాపురం: బాల్య వివాహాలు జరగకుండా పర్యవేక్షించాలని నరసాపురం డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ వి.ప్రసాద్ సూచించారు. బుధవారం జరిగిన సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని డాక్టర్ ప్రసాద్ తన కార్యాలయంలో నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధానికి విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం వచ్చినా వెంటనే అప్రమత్తం కావాలని చెప్పారు. లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.పద్మావతి, డాక్టర్ కె.హరిణి తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు 86 శాతం పింఛన్ల పంపిణీ



కృత్తివెన్ను వెళ్లి పెన్షన్ అందిస్తున్న భీమవరం 39 వార్డు వలంటీరు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ పెన్షన్ కానుకను జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేశారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 86 శాతం మేర పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,19,251 మంది లబ్ధిదారులు ఉండగా వారికి రూ.59.82 కోట్లు చెల్లించాల్సిఉంది. బుధవారం 1,92,967 మందికి రూ 52. 81 కోట్లు చెల్లించారు. భీమవరం 39 వార్డుకు చెందిన పి.మంగమ్మ కృష్ణా జిల్లా కృత్తివెన్నులో ఉండడంతో వలంటీరు ముత్యాల వెంకటేష్ సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించి పెన్షన్ అందజేశాడు.

మేరీ గ్రేస్ కుమారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయపీఠం చైర్‌పర్సన్‌గా ఎ.మేరీ గ్రేస్‌కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వారు నేరుగా ఈ న్యాయపీఠాన్ని ఆశ్రయిస్తే సమస్యను పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ శాశ్వత లోక్‌అదాలత్‌లో రూ. కోటి మొత్తం వరకు సమస్యల్ని విచారిస్తారని చెప్పారు. ఇరుపార్టీలు సమన్వయంతో సామరస్యంగా వ్యాజ్యాన్ని 60 రోజుల్లో పరిష్కరిస్తారని చెప్పారు. రాజీ కుదరని పక్షంలో వారు సమర్పించిన పత్రాలు పరిశీలనలో తీసుకుని అవార్డు ఇస్తారన్నారు. దానిని వేరే కోర్టులో అప్పీలు, చాలెంజ్ చేసుకునే అవకాశం లేదని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 6,918 మంది హాజరు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రాక్టికల్స్ నాల్గో రోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 6,918 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు బుధవారం 92 కేంద్రాల్లో 6,521 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,388 మంది హాజరయ్యారు. 20 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 595 మంది హాజరు కావాల్సి ఉండగా 530 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.



ముఖ్యమంత్రికి స్వాగతం

నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, వీఆర్ ఎలీజా, ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. - సాక్షి నెట్‌వర్క్

వేట ముమ్మరం

- బిజీబిజీగా మత్స్యకారులు
- నరసాపురం తీరం నుంచి రూ.200 కోట్ల ఎగుమతులు
- టైగర్ రొయ్యల కోసం అన్వేషణ



నరసాపురం లాకుల వద్ద గోదావరి తీరంలో వేట బోట్ల కళకళ

నరసాపురం: మరికొన్ని రోజుల్లో సముద్రంలో వేటకు విరామం ప్రకటించనున్నారు. మరోవైపు నరసాపురం తీరం పొడవునా సముద్రంలో వేట ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. పలు జిల్లాలకు చెందిన మెకనైజ్డ్ వేట బోట్లు తీరంలో వేట సాగిస్తున్నాయి. లాకులు వద్దనున్న వశిష్ట గోదావరి పాయ వద్ద వేట బోట్లు సందడి చేస్తున్నాయి. మచిలీపట్నం, కాకినాడ, నెల్లూరు, విశాఖ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 వరకూ బోట్లు నరసాపురం తీరంలో వేట సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఇప్పుడిప్పుడే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. వాతావరణం చేపల వేటకు పూర్తి అనుకూలంగా ఉండటం, పైగా ఎక్కువగా చేపలు దొరికే సీజన్ కావడంతో మత్స్యకారులు బిజీబిజీగా ఉన్నారు.

రూ.200 కోట్ల మత్స్య సంపద ఎగుమతి

ఈ ఏడాది ప్రతికూల వాతావరణం మధ్య కూడా నరసాపురం తీరంలో మత్స్యసంపద భారీగా లభించింది. గత జూన్ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకూ దాదాపుగా రూ.200 కోట్ల మత్స్యసంపద ఎగుమతులు జరిగినట్టుగా అంచనా. నిజానికి ఈ ఏడాది సముద్రంలో వేట మత్స్యకారులకు ప్రతికూల వాతారణం మధ్య కొనసాగింది. వరుస తుఫాన్‌లు వెంటాడాయి. అయినా కూడా భారీగా సరుకు పడటం, ఎగుమతులు సాగడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీఏటా అమలుచేసే సముద్రంలో వేట నిషేధం గడువు ఎత్తేసిన తర్వాత జూన్ నుంచి మత్స్యకారులు సముద్రంలో వేట సాగిస్తారు.

జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఈ ఏడాది వరుస తుఫాన్‌లు, ప్రతికూల వాతావరణం మత్స్యకారులను ఇబ్బంది పెట్టింది. జనవరి నుంచి ఏప్రిల్ వరకూ సీజన్ నడుస్తుంది. ఈ ఏడాది సీజన్ కలిసివచ్చింది. జనవరి నుంచి చేపలు పెద్ద సంఖ్యలో పడటం, ఆశించిన మేర ఆదాయం రావడంతో మత్స్యకారులు ఉల్లాసంగా ఉన్నారు. దీంతో వేట ముమ్మరంగా సాగుతుంది. ప్రస్తుతం చేపలు పెద్ద సంఖ్యలో వలలకు చిక్కుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ప్రతీ ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకూ కేంద్ర ప్రభుత్వం సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. దేశవ్యాప్తంగా వేట నిషేధం అమల్లో ఉంటుంది. ఈ 61 రోజులు పాటూ మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. మరో 45 రోజుల్లో వేట నిషేధం గడువు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో వాతావరణం అనుకూలించడంతో సీజన్‌ను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

వారం రోజుల్లోనే ఒడ్డుకు



సముద్రంలో ముమ్మరంగా వేట సాగుతోంది. సముద్రంలోకి వెళ్లిన బోటు వారంరోజుల లోపునే సరుకుతో ఒడ్డుకు తీసుకొస్తున్నాం. మాకు బోటు యజమానులు పడిన సరుకుకు బట్టి డబ్బులు ఇస్తారు. కాబట్టి ఆనందంగా ఉంది.

– మల్లాడి సాయిబాబా, బోటు కార్మికుడు

ఏడాది చివరిలో లాభాలు



ఈ ఏడాది చివరిలో వేట పుంజుకుంది. గత ఏడాది వేట నిషేధం గడువు ముగిసిన తరువాత జూన్ నుంచి వేట ఉత్సాహంగా ప్రారంభించాం. తుఫాన్‌లతో కలసి రాలేదు. జనవరి నుంచి వేట బాగా సాగుతుంది. కరెంట్ కోతలు లేకపోవడంతో ఐస్‌కు కొరతలేదు. డీజిల్ ధరలు పెరగడంతో కొంతమేర పెట్టుబడి పెరిగినా, సరుకు బాగా పడటంతో లాభాలు చూస్తున్నాం.

– పీతల ప్రసాద్, బోటు యజమాని

టైగర్ రొయ్య కోసం అన్వేషణ : ప్రస్తుతం టైగర్ రకం రొయ్యలు దొరుకుతాయి. గుడ్డు రొయ్యిగా పలిచే దీనికి మంచి డిమాండ్ వుంది. ఈ రొయ్యను కాకినాడ, విశాఖపట్నాల్లోని హేచరీలకు తరలిస్తారు. అక్కడ ల్యాబ్స్‌లో ఈ రొయ్యలో వుండే వేలాది గుడ్ల నుంచి సీడ్‌ను ఉత్పత్తి చేస్తారు. ప్రస్తుతం వేట సమయంలో మత్స్యకారులకు ఈ రొయ్యలు కొన్ని దొరికినా పండుగే. ఈ రొయ్యలు కిలో ధర రూ 20 వేల పైనే ఉంటుంది. ఇవి చాలా అరుదుగా దొరుకుతాయి. టైగర్ రొయ్యల కోసం బోట్లలో తీవ్రంగా శ్రమిస్తారని నరసాపురం పట్టణానికి చెందిన బోటు యజమాని పీతల ప్రసాద్ చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



ప్రధాన ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, బందోబస్త్ ఏర్పాట్లపై బుధవారం ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎం.కె.మీనా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏర్పాట్లను వివరించారు. ప్రజా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు, ఓటర్ స్లిప్‌లు అందిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్త్ ప్రణాళిక రూపొందించామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. పోలింగ్ సిబ్బందికి మార్చి 2న, మైక్రో అబ్జర్వర్లకు మార్చి 4న శిక్షణ అందిస్తున్నామన్నారు.

4న డీడీఆర్‌పీ బృందం పోలవరం పర్యటన

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను ఈ నెల 4, 5 తేదీల్లో డీడీఆర్‌పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్) బృందం సభ్యులు పరిశీలించనున్నారు. డీడీఆర్‌పీ చైర్మన్ ఏబీ పాండ్యా, భార్గవ్, వైకే హోండా తదితరులతో కలిసిన బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 4వ తేదీన పోలవరం పనులను పరిశీలించి, 5న పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తారు.

ఎస్‌టీసీ పోటీల్లో పతకాల పంట



పతకాల సాధించిన ఏలూరు ఎస్‌టీసీ అథ్లెట్లు

ఏలూరు రూరల్: ఫిబ్రవరి 20 నుంచి 26 వరకూ పంజాబ్ రాష్ట్రం పటియాలలో ఆల్ ఇండియా స్టేట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్ (ఎస్‌టీసీ) అథ్లెటిక్స్ పోటీల్లో ఏలూరు ఎస్‌టీసీ సెంటర్ క్రీడాకారులు పతకాల పంట పండించారని సెంటర్ ఇన్‌చార్జి వినాయక్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో వి.భార్గవి అండర్–16లో జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించిందని వివరించారు. జి.నీలిమ 20 ఏళ్ల విభాగం జావెలిన్‌త్రోలో బంగారు పతకం చేజిక్కించుకుందన్నారు. ఎం.మానస రజతం, కాంస్యం సాధించారన్నారు. బాలుర విభాగంలో కె.ధనుష్, పి.వెంకటేష్ బంగారు పతకాలు సాధించారని చెప్పారు.

6లోగా లైబ్రరీ కోర్సుకు ఫీజు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు సంబంధించి రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థులు ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత కళాశాల ప్రిన్స్‌పాల్స్ ద్వారా పరీక్ష రుసుం 6 లోగా ఫీజు చెల్లించాలని చెప్పారు.

సుస్థిర అభివృద్ధికి కృషిచేయాలి

రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్

ఏలూరు(మెట్రో): స్పందన సమస్య మనదే అన్న దృక్పథంతో పనిచేస్తే తప్పక సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జీఎస్‌ఆర్‌కెఆర్ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి మినీ ఆడిటోరియంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలీసు, క్షేత్రస్థాయి అధికారులకు సుస్థిర అభివద్ధి లక్ష్యాలు, స్పందన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలన్నారు. సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను సూచికలుగా నిర్దేశించిందన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడానికి అనేక సంస్కరణలు చేపట్టామని చెప్పారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించినందుకు రెండు జిల్లాల కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిలను అభినందించారు. స్పందన విచారణాధికారి అప్‌లోడ్ చేసేటప్పుడు అర్జీదారు అడిగిన సమాచారాన్ని మాత్రమే అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

లక్ష్యాల సాధనకు మరింత కృషిచేయాలి

ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కోవిడ్ పరిస్థితుల వల్ల అభివృద్ధి కొంత కుంటుపడిందన్నారు. మళ్ళీ ఈ లక్ష్యాలను సాధించేందుకు రెట్టింపు స్థాయిలో గురి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు జోడించామన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఆయా ఇండికేటర్స్ లక్ష్యాలకు జిల్లా స్థాయి నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. స్పందన దరఖాస్తుల రీఓపెన్‌ను 15.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గించామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ సంబంధిత వివరాలు డేటా ఎంట్రీ చేయకపోవడం వల్ల ఆన్‌లైన్‌లో ప్రగతి ప్రతిబింబించడం లేదన్నారు. ఆయా సమస్యలను మానవీయకోణంలో చూస్తే సమస్య పరిష్కరించడం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పట్టణ పరిపాలన శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ పురపాలనలో స్పందన, కాలుష్య నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి ఎస్‌డీజీ లక్ష్యాలను వివరించారు. స్పందన వినతులపై జె.జీవన్, గ్రామ, వార్డ్ వలంటీర్ ఎస్‌డీజీలపై అనూష, క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై డా.విజయ దుర్గ, హెల్త్ ఇండికేటర్స్‌పై శివశంకర్ బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై గీతా రాణి, మహిళాభివృద్ధి రోజా రాణి, స్థానిక సంస్థలకు సంబంధించి ప్రసాద్, పట్టణాభివృద్ధిపై రవీంద్ర బాబు పవర్ పాయింట్ ద్వారా అవగాహన కలిగించారు.

శరవేగంగా బ్లడ్ బ్యాంకు నిర్మాణం

రూ.1.55 కోట్లతో ఏర్పాటు



బ్లడ్ బ్యాంకు క్యాబిన్లు



బ్లడ్ దోనర్ కోచ్

భీమవరం(ప్రకాశం చౌక్): నూతన పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం రాయలంలో రూ.1.55 కోట్లతో ఏర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు పి.ప్రశాంతి సూచనల మేరకు 3,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని సదుపాయలతో ఈ బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశారు. రెండు అంతస్తుల భవనంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కాగా గ్రౌండ్ ఫ్లోర్‌లో డోనర్స్ నుంచి రక్తం సేకరణ, పలు పరీక్షల కోసం విడివిడిగా ప్రత్యేక క్యాబిన్లు, మొదటి అంతస్తులో రక్తం కాంపొనెంట్ కోసం ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. రక్తదాతలకు రిజిస్ట్రేషన్, వెయిటింగ్ ఏరియా, కౌన్సెలింగ్ ఏరియా, మెడికల్ ఎగ్జామినేషన్, బ్లడ్ డొనేషన్ రూమ్, రెస్ట్ రూమ్, వివిధ పరీక్షలకు ల్యాబ్‌లు, క్వాలిటీ అస్యూరెన్స్ రూమ్, బ్లడ్ స్టోరేజ్ రూమ్ వంటి 15 క్యాబిన్‌లు ఏర్పాటు చేశారు. మరో రెండు వారాల్లో ఇన్‌స్టాలేషన్, రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి, లైసెన్స్ ప్రక్రియ మొదలు పెట్టడానికి చర్యలు తీసుకున్నట్లు బ్లడ్ బ్యాంకు చైర్మన్ శివరామభద్రరాజు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఇంతవరకు రూ.35 లక్షల ఆర్థిక సాయం చేశారు.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

చాట్రాయి: పెండింగ్ లేకుండా కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తు అనంతరం చార్జిషీట్లను సంబంధిత కోర్టులో ఫైల్ చేయాలని చెప్పారు. నాటు సారా, జూదం, గంజాయి లాంటి సమాచారాన్ని సేకరించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. నేర చరిత్ర కలిగినవారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, రాత్రి బీట్‌లు కచ్చితంగా నిర్వహించాలని, మారుతున్న చట్టాలకు అనుగుణంగా సిబ్బంది విధి నిర్వహణ చేయాలని సిబ్బందికి సూచించారు.

మధురంగా జగనన్న గోరుముద్ద

గతంలో కేవలం పప్పు, సాంబారుతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మొక్కుబడిగా అమలయ్యేది. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకాన్ని సమూల ప్రక్షాళన చేసి జగనన్న గోరుముద్దగా మార్చి ప్రత్యేక మెనూతో విద్యార్థులకు ఇష్టమైన నాణ్యమైన ఆహార పదార్థాలతో అందిస్తుండటంతో వారికి మధురంగా మారింది. కిచిడీ, ఫ్రైడ్ రైస్, పులిహోర వంటి ఆహార పదార్థాలతో పాటు కోడిగుడ్లు, చిక్కీ వంటి పౌష్టికాహారంతో కూడిన ప్రత్యేక మెనూతో నిబద్ధతతో విద్యా సంవత్సరం చివరి వరకు కూడా నాణ్యత, రుచిలో రాజీ పడకుండా అందిస్తుండటంతో పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం చేసే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 1.84 లక్షల మంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను ఇష్టంగా తింటుండటం విశేషం.

- మధ్యాహ్న భోజనం ఇష్టంగా తింటున్న పాఠశాలల విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో 1,84,173 మందికి నాణ్యత, రుచిగా వడ్డింపు
- సర్కారు బడుల్లో పటిష్టంగా అమలవుతున్న ప్రత్యేక మెనూ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆకలి బాధతో విద్యను నిర్లక్ష్యం చేయరాదన్నదే మధ్యాహ్న భోజన పథకం లక్ష్యం. అనంతర కాలంలో ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా బడిలో పెట్టే భోజనం తినేందుకు ధైర్యం చేయలేని పరిస్థితి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యార్థులు ఈ పరిస్థితి నుంచి బయటపడి ఇష్టంగా తినేలా చర్యలు తీసుకున్నారు. గత మూడేన్నరేళ్లుగా జగనన్న గోరుముద్దగా రూపాంతరం చెందిన ఈ పథకంలో కిచిడీ, ఫ్రైడ్ రైస్, పులిహోర వంటి ఆహార పదార్థాలతో పాటు కోడిగడ్లు, చిక్కీలు వంటి పౌష్టికాహారం కూడా అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించగా అందులోనూ పెడర్థాలు తీసిన ప్రతిపక్షాలు ఈ పథకం ఎంతకాలం సాగుతుందిలే అని నిష్టూరాలు పోయారు. ఆదిలో ఉన్న నాణ్యత చివరి వరకు ఉండదని విమర్శించారు. కాగా విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్నా ఈ పథకాన్ని అదే నిబద్ధతో కొనసాగిస్తుండడంతో విమర్శకుల నోళ్లకు తాళాలు పడ్డాయి. ఆదిలో ఉన్న నాణ్యత, అదే మెనూతో అదే పరిమాణంలో మధ్యాహ్న భోజన పథకం విద్యాసంవత్సరం చివరిలోనూ కొనసాగుతూ తల్లిదండ్రుల ప్రశంసలను అందుకుంటోంది.

నాణ్యతపై రాజీ లేదు

వైఎస్ జగన్ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్దకు ఇప్పుడు ఎక్కువ మంది విద్యార్థులు ఆకర్షితులయ్యారు. రాజీ లేని నాణ్యతతో గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారు. సోమవారం అన్నం, కోడిగుడ్డు కూర, పప్పుచారు, చిక్కీ, మంగళవారం పులిహోర, టమాటా పప్పు, ఉడకబెట్టిన గుడ్డు, బుధవారం వెజిటబుల్ రైస్ (ఫ్రైడ్‌రైస్), ఆలూ కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ, గురువారం కిచిడీ, టమాటా చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన గుడ్డు, శనివారం అన్నం, సాంబారు, తీపి పొంగలి వడ్డిస్తున్నారు. విద్యార్థులు కూడా ఈ నాణ్యమైన, పౌష్టికాహారాన్ని వదలకుండా ఇష్టంగా తింటున్నారు. దీని నిమిత్తం ఏలూరు జిల్లాలో రూ.4.14 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.3.75 కోట్ల మొత్తాన్ని వెచ్చిస్తున్నారు.



ఏలూరు సెయింట్ థెరిస్సా పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రెండు జిల్లాల్లో 3,197 పాఠశాలల్లో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం)ను 1,84,173 మంది విద్యార్థులు ఎంతో ఆస్వాదిస్తూ తీసుకుంటున్నారు. కోడిగుడ్లు, చిక్కీలు వంటి పదార్థాలు గోరుముద్దలో చోటుచేసుకోవడంతో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో ఏలూరు జిల్లాలోని 1,815 పాఠశాలలకు చెందిన 1,06,913 మంది విద్యార్థులుండగా, పశ్చిమగోదావరి జిల్లాలో 1,382 పాఠశాలలకు చెందిన 77,260 మంది విద్యార్థులున్నారు.

బకాయిలు లేకుండా చెల్లింపులు

మధ్యాహ్న భోజనం వండి వడ్డించే కుక్‌లు, హెల్పర్లకు గత ప్రభుత్వాలు నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా బకాయి పెట్టేవి. ఫలితంగా కొన్ని చోట్ల కుక్, హెల్పర్లు నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ అప్పట్లో ఆందోళనలు జరిగాయి. అయితే కుక్, హెల్పర్లకు గత ప్రభుత్వాలు ఇచ్చిన రూ.1000 గౌరవ వేతనాన్ని మరో రూ.2 వేలకు పెంచి మొత్తం రూ.3 వేలు అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పెంచిన మొత్తాన్ని కూడా ఎప్పటికప్పుడు విడుదల చేయడం వల్ల వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడానికి, ప్రభుత్వ ఆశయాన్ని కొనసాగించడానికి కృషి చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 3,426 మందికి, పశ్చిమ గోదావరి జిల్లాలో 2,576 మందికి గౌరవ వేతనంతో పాటు మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు అయ్యే నిత్యావసరాల బిల్లులను కూడా సకాలంలో చెల్లిస్తుండడం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజన పంపిణీకి మరో కారణంగా చెప్పవచ్చు. ఈ మేరకు కుక్, హెల్పర్లకు కేవలం గౌరవ వేతనంగా రూ.77.31 లక్షలు చెల్లిస్తున్నారు.

జనవరి వరకు బిల్లులు చెల్లించేశాం



జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి కుక్, హెల్పర్లకు చెల్లించాల్సిన నిత్యావసర బిల్లులు, గౌరవ వేతనాలను జనవరి నెలకు సంబంధించినవి కూడా చెల్లించేశాం. ఫిబ్రవరి బిల్లులు మరో మూడు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకున్నాం. విద్యా సంవత్సరం ముగుస్తున్నందున భోజనంలో ఎటువంటి నాణ్యతా లోపం తలెత్తకుండా సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా అప్రమత్తం చేశాం.

– ఎన్వీ రవిసాగర్, ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ (ఆచంట) : ఆచంట మండలం కోడేరు లంకపల్లెపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

మహిళా కోర్టు ఏపీపీగా రామాంజనేయులు



ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 5వ అదనపు కోర్టు, మహిళా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డీవీ రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం నియామక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పదవిలో రామాంజనేయులు మూడేళ్లపాటు కొనసాగనున్నారు. 1997లో ఏపీ బార్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఏడాది పాటు అప్రెంటీస్ పూర్తి చేశారు. అనంతరం 1998లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. నర్సాపురం, పాలకొల్లు బార్‌లలో పదేళ్లపాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2007 నుంచి ఏలూరు బార్ అసోసియేషన్‌లో చేరి క్రిమినల్, సివిల్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, రీజనల్ కో–ఆర్డినేటర్‌గా సేవలందించారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

వర్సిటీ చెస్ జట్టు ఎంపిక



డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ చెస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్ : చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఈ నెల 10 నుంచి 12 వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలు జరగనున్నాయని ఆశ్రం వైద్య కళాశాల పీడీ వీవీఎస్ఎం శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ జట్టును డాక్టర్ కె.రామకృష్ణ, ఎస్.నల్లయ్యతో కూడిన సెలెక్షన్ కమిటీ బుధవారం ఆశ్రం ఆవరణలో ఎంపిక పోటీలు నిర్వహించిందన్నారు. ఇందులో ప్రతిభ చూపిన బి.శివకుమార్, వి.తరుణ్, కె.జయంత్‌రెడ్డి, పి.స్నేహిత, ఎంజీ నాగసాయిపవన్, బి.గణేష్ ఎంపికయ్యారని వెల్లడించారు. వీరితో పాటు ఏఏ కార్తిక్, బీజేపీ కిషోర్, ఎ.శరత్‌చంద్ర స్టాండ్‌బై క్రీడాకారులుగా ఎంపిక చేశారు.

108 వాహనంలో ప్రసవం

పోడూరు: మట్టపర్రు గ్రామానికి చెందిన ఓ మహిళ బి.శిరీష బుధవారం 108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఉదయం 6 గంటలకు ఆమెకు పురిటినొప్పులు రావడంతో హెచ్‌వీ జయమణి, ఏఎన్‌ఎం స్వాతి, ఆశా కార్యకర్త అమ్మాజీ ఆమెను 108 వాహనంలో పోడూరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది. తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. గర్భిణి క్షేమంగా బిడ్డకు జన్మనివ్వడంతో గ్రామస్తులు వైద్యసిబ్బందిని, వాహన సిబ్బంది కె.సత్యనారాయణ, జి.ప్రసాద్‌లను అభినందించారు.

మారంపల్లిలో కోడిపందేలపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మారంపల్లిలో కోడిపందేల శిబిరంపై మంగళవారం రాత్రి దాడి చేసి 17 మంది కోడిపందేల రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై వీరభద్రరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.94,600 నగదు, నాలుగు కోడి పుంజులు, 18 కోడి కత్తులు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

బాలుడు, అతని స్నేహితులు నలుగురిపై పోక్సో కేసు

ద్వారకాతిరుమల: బాలికపై అత్యాచారయత్నం చేసిన బాలుడిపై, అలాగే అతడికి సహకరించిన మరో నలుగురు బాలురపై మంగళవారం రాత్రి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ బుధవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. జి.కొత్తపల్లికి చెందిన బాలిక స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుతోంది. గతనెల 23న గ్రామంలోని ఓ ఇంటికి వెళ్లి గులాబీ పువ్వు కోసుకుని తిరిగి ఇంటికి వెళుతోంది. అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ బాలుడు బాలికను బలవంతంగా తన ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెళ్లి తలుపులు కొట్టగా బాలుడు పరారయ్యాడు. దీనిపై గ్రామంలో పెద్దలు పంచాయతీ నిర్వహించగా తన నలుగురి స్నేహితుల ప్రోద్బలంతో చేసినట్టు బాలుడు చెప్పాడు. దీనిపై గతనెల 28న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరోజు రాత్రి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై చెప్పారు. ఇదిలా ఉండగా, బాలికపై ఐదుగురు యువకులు అఘాయిత్యానికి పాల్పడినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు చెప్పారు. బాలికపై అత్యాచారయత్నం చేసిన బాలుడితో పాటు, అతడికి సహకరించిన నలుగురు బాలురపై కేసు నమోదు చేశామన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులపై చర్యలు చేపడతామన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఆగిరిపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎస్‌ఏ పేటకు చెందిన దూదేకుల సుల్తానా విజయవాడలో గర్భిణిగా ఉన్న తన కుమార్తెను చూసేందుకు గత నెల 27న కుమారుడు కాజాబాషా (19)తో కలిసి వెళ్లారు. అక్కడ చిన్నపాటి గొడవ జరగడంతో కాజాబాషాను మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అతను మరుసటి రోజు ఎస్‌ఏ పేటలోని తన ఇంటికి వచ్చి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై తల్లి సుల్తానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.చంటిబాబు బుధవారం తెలిపారు.

12 చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

తణుకు: తణుకు రూరల్, అత్తిలి, ఇరగవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 12 చోరీ కేసుల్లో ఐదుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.2 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య చెప్పారు. స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న ఇంటి ఆవరణలో విద్యుత్ మోటార్లను అపహరించుకుపోతున్న పెరవలి మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన యడ్ల శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి మొత్తం 10 కేసుల్లో 13 విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన మరో రెండు కేసుల్లో తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన వజ్జిపర్తి రామదుర్గాప్రసాద్, దేవరపు రవి, ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన రెడ్డి కృష్ణ, సత్యవాడ గ్రామానికి చెందిన అగ్రహారపు దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు బ్యాటరీలు, రెండు మేకలను స్వాధీనం చేసుకున్నారు. 12 కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఎస్సై వెల్లడించారు. మేట్రిక్స్ సంస్థ ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేసులను ఛేదించామన్నారు. ఎస్సై గుర్రయ్య, కానిస్టేబుళ్లు అక్బర్‌లాల్, అన్వర్, మహేశ్వరరావు, మాధవరావులను సీఐ ఆంజనేయులు అభినందించారు.



తణుకులో నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గుర్రయ్య

భారత ప్రభుత్వం – ఆర్థిక మంత్రిత్వ శాఖ – ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ రికవరీ ఆఫీసర్–II వారి కార్యాలయం
31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020
Tele No.0891-2957045, E mail : ro2.drtvpatnam@gmail.com

ఇ–వేలం ద్వారా అమ్మకపు ప్రకటన
(ఆదాయపుపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూల్ రూల్ 52(2) చూడుము)
ఓ.ఎ.నెం.454/2016లోని ఆర్.పి.నెం.634/2017

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా మరియు **శ్రీ ముదుండి పెద్దిరాజు మరియు ఇతరులు** మధ్యనున్న ఓ.ఎ.నెం.**454/2016**కు సంబంధించి బ్యాంక్‌లు మరియు ఫైనాన్షియల్ సంస్థల ఋణ బకాయిల వసూలు చట్టం 1993 యొక్క 19(22) విభాగం పరిధిలో మహారాజశ్రీ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ వారిచే రికవరీ సర్టిఫికెట్ **తేది.14.09.2017** జారీచేయబడినది మరియు దానిని అమలుపరచు నిమిత్తం పంపటమైనది.

2. రికవరీ సర్టిఫికేట్‌లో సూచించిన **రూ.1,33,68,674/-** (అక్షరాల ఒక కోటి ముప్పై మూడు లక్షల అరవై ఎనిమిది వేల ఆరు వందల డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే)తో పాటు వడ్డీ, ఖర్చులు వగైరాలు ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ (ఋణగ్రహీతలు) నుండి వసూలు చేయుటకు **ఆర్.పి.నెం.634/2017** నందలి తీర్మానములు అమలుపరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.

(సిడి-1) శ్రీ ముదుండి పెద్దిరాజు, తండ్రి: ఎం.కృష్ణంరాజు, డి.నెం.3012, ముదునూరివారివీధి, ఐ.భీమవరం గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

(సిడి-2) శ్రీ అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్, తండ్రి: ఎ.వెంకటేశ్వర్లు, డి.నెం.1-184/4, దుంపగడప గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

(సిడి-3) శ్రీ సుదర్శనం పురుషోత్తం ఆచార్యులు, తండ్రి: ఎస్.వెంకట వేదాచార్యులు, డి.నెం.4-14, ఐ.భీమవరం గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

(సిడి-4) శ్రీ నేరెళ్ళ వెంకట రామమోహన రావు, తండ్రి: ఎన్.రాములు, డి.నెం.17-74, రైల్వే స్టేషన్, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా.

3. తేది.31-01-2023 (తేది.31-01-2023 వరకు వడ్డీ లెక్కించబడినది) నాటికి **రూ.3,57,07,569/-** + తదుపరి వడ్డీ కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు నుండి రికవరీ ప్రొసీడింగ్స్ కొరకు మినహాయించి సంతృప్తి భాగంలో ప్రకారం చెల్లించవలసియున్నది.

4. సర్టిఫికెట్ డెటార్స్ షెడ్యూల్డ్ ఆస్తులు క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరిచిన వెబ్‌సైట్: https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించటమైనది. వేలం సమయం ఆటో ఎక్స్‌టెన్షన్ క్లాజు నందు 5 నిముషాలు పొడిగింపుతో సూచించబడినది అనగా వేలం ముగిసే లోగా బిడ్ వేసినట్లయితే ఇ-వేలం ముగింపు సమయం 5 నిమిషాలు పొడిగించబడును. **ఇ-వేలం తేదీ, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరు తేదీ, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంచు మొత్తం వేలం సమయం ప్రతి ఐటమ్/షెడ్యూలు దిగువ సూచించటమైనది.**

బిడ్లు దాఖలుకు ఆఖరు తేది : 06.04.2023 (సా॥4.00 గం॥ల వరకు) ఇ–వేలం తేది : 11.04.2023

షెడ్యూల్ & ఐటమ్ నెంలు	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్డుపెంచవలసిన మొత్తం రూ.	వేలం సమయం
షెడ్యూల్-బి ఐటమ్ నెం.1	ఎ.0.23 సెంట్లు లేదా 1113.20 చ॥గ॥లు వ్యవసాయ భూమి	17,00,000/-	1,70,000/-	25,000/-	ఉ॥11.00 గం॥ల నుండి మ॥12.00 గం॥ల వరకు
షెడ్యూల్-బి ఐటమ్ నెం.2	ఎ.0.23 సెంట్లు లేదా 1113.20 చ॥గ॥లు వ్యవసాయ భూమి	17,00,000/-	1,70,000/-	25,000/-	
షెడ్యూల్-సి ఐటమ్ నెం.1	ఎ.0.23 సెంట్లు లేదా 1113.20 చ॥గ॥లు వ్యవసాయ భూమి	17,00,000/-	1,70,000/-	25,000/-	
షెడ్యూల్-సి ఐటమ్ నెం.2	ఎ.0.23 సెంట్లు లేదా 1113.20 చ॥గ॥లు వ్యవసాయ భూమి	17,00,000/-	1,70,000/-	25,000/-	

వేలం యొక్క సమయం: వేలం సమయం ఆటో ఎక్స్‌టెన్షన్ క్లాజు నందు 5 నిముషాలు పొడిగింపుతో సూచించబడినది అనగా వేలం ముగిసే లోగా బిడ్‌వేసినట్లయితే ఇ-వేలం ముగింపు సమయం 5 నిమిషాలు పొడిగించబడును.

5. సర్వీసు ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీసు ప్రొవైడర్ వివరములు: **మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వారు: శ్రీ ధరణి కృష్ణ, సంప్రదించవలసిన నెం. 9948182222, E-Mail id: andhra@c1india.com.**

6. ఆసక్తి గల బిడ్డర్లు/పాల్గొనువారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినదిగా తెలియజేయడమైనది మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ మొదలగు వాటి కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించవలసిందిగా సలహాసీయడమైనది.

7. ఆసక్తి గల బిడ్డర్లు/పాల్గొనువారు ఇ.ఎమ్.డి సొమ్మును **ఆర్.టి.జి.యస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్** ద్వారా **అకౌంట్ నెం.09434915010026, అకౌంట్ పేరు: ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ & బ్రాంచ్: ఐడిబిఐ బ్యాంక్, దానవాయిపేట బ్రాంచ్, IFSC Code: IBKL0000094**కు జమ చేయవలెను మరియు బిడ్ ఫారంలను పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరుతేదీ లోపల ఆన్‌లైన్‌లో సమర్పించవలెను మరియు పూర్తిచేసిన స్వీయ ధృవీకరించబడిన కాపీలు, బిడ్ ఫారమ్సను పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్ మరియు ఇ.ఎమ్.డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకం దారునకు రిజిస్టర్డ్ పోస్ట్/స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా **తేది.10.04.2023 సా॥4.00 గం॥లలోపు** అందేటట్లు పంపవలెను. పోస్టల్ ఆలస్యమునకు బాధ్యత వహించబడదు.

8. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు వేలం పూర్తి నియమ నిబంధనలు, విచారణలు, మార్గదర్శకత్వం, షెడ్యూలు ఆస్తి తనిఖీ, దస్తావేజులు మరియు ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్స్ పరిశీలించుటకు, షెడ్యూల్ ఆస్తి వివరాలు తెలుసుకొనుటకు **శ్రీ కె.వి.కృష్ణయ్య, డిజిఎం, & బ్రాంచ్ హెడ్ (సంప్రదించవలసిన నెం.9703200556, ఫోన్ నెం.08832433335)** బ్రాంచి ఈ-మెయిల్ ఐడి: **rb094@idbi.co.in** వారిని సంప్రదించవలెను. దిగువ సంతకందారు సఫలీకృత బిడ్డరు పేరున అమ్మకం నిర్ధారణ చేసిన తరువాత సదరు విజేత అయిన బిడ్డరుకు బ్యాంకు యొక్క బ్రాంచ్ హెడ్ ఆస్తిని మరియు దానికి సంబంధించిన టైటిల్ డీడ్ డాక్యుమెంట్స్‌ను (క్రింద పేర్కొన్న వరుస నెం.8ఎ, 8బి, 8సి & 8డి వద్ద పేర్కొన్న నిబంధనలకు మరియు షరతులకు లోబడి) అందజేస్తారు.

8ఎ) వేలం కోసం ఉంచిన ఆస్తులు 2018 నాటి ఎఫ్ఐఆర్ నెం.ఆర్‌సి 02 (ఎ) ప్రకారం, సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం దర్యాప్తులో ఉన్నాయని మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం విచారణలో ఉన్నాయని ఆసక్తి ఉన్న బిడ్డర్లు గమనించవలసిందిగా కోరడమైనది.

8బి) సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం 26-04-2018 & 06-07-2021 నాటి లేఖ ప్రకారం సిబిఐ నుండి నిర్దిష్ట అనుమతి లేకుండా ఒరిజినల్ టైటిల్ డీడ్‌లను విడుదల చేయవద్దని బ్యాంకుకు సూచించారు. అయితే, వేలంలో విజయవంతమైన కొనుగోలుదారు పేరు మీద ఎస్.ఆర్.ఓలో సేల్ సర్టిఫికెట్‌ను నమోదు చేయడానికి సమ్మతి తెలిపియున్నారు.

8సి) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం 08-06-2018 నాటి లేఖ ప్రకారం తనఖా పెట్టబడిన / తాకట్టు పెట్టిన ఆస్తుల యొక్క ఒరిజినల్ ఆస్తి పత్రాలను బ్యాంక్ సంరక్షణలో ఉంచాలని మరియు వారి సమ్మతి లేకుండా విడుదల చేయవద్దని బ్యాంకుకు సూచించారు.

8డి) 2018 ఎఫ్ఐఆర్ నెంబర్ ఆర్‌సి 02 (ఎ)లో సంబంధిత విచారణకు సంబంధించి ఒరిజినల్ టైటిల్ డీడ్‌లు సిబిఐ వద్ద ఉన్నాయి.

ఆస్తి యొక్క వివరములు: షెడ్యూలు:

డిఫెండెంట్స్ అయిన 2,3వ వారిచే అప్లికెంట్ బ్యాంక్ పేరున తనఖా చేయబడిన షెడ్యూల్-బి, సి స్థిరాస్తులు. 8 కెసిసి లోన్స్‌కు ఉమ్మడి తనఖాగా రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.1345/2011, తేది:21-04-2011 ప్రకారం తనఖా చేయబడినది : షెడ్యూల్-బి: 2వ ప్రతివాది అనగా శ్రీ అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్, తండ్రి: ఎ.వెంకటేశ్వర్లు ఒరిజినల్ టైటిల్ డీడ్స్ అంటే రిజిస్టర్డ్ క్రయ దస్తావేజులు డార్జిగా ఇవ్వు నిమిత్తం కామన్ సెక్యూరిగాను మరియు గ్రూపులో ఒకరిగా గ్రూపు పేరున 8 మంది కెసిసి ఋణ సదుపాయములు తిరిగి చెల్లింపునకు సెక్యూరిటీగాను తనఖాపెట్టబడినది. 8 మంది గ్రూపు: 1.ఎ.ఎన్.వి.శ్రీనివాస్-రూ.75 లక్షలు, 2.ఎస్‌పురుషోత్తమచార్యులు-రూ.74 లక్షలు, 3.యు.కనక రావు-రూ.75 లక్షలు, 4.ఎన్.ఎస్.గాంధీ-75 లక్షలు, 5.కె.ఎన్.వి.ప్రసాద్-రూ.75 లక్షలు, 6.ఎం.భాగ్యరాజు-రూ.74 లక్షలు, 7.సిహెచ్.జెన్నీ-రూ.73 లక్షలు, 8.ఎం.పెద్దిరాజు-రూ.73 లక్షలు. మొత్తం 8 కెసిసి ఋణ ఖాతాల మొత్తము సెక్యూరిటీ బాధ్యత రూ.594 లక్షలు. అందులో రూ.73 లక్షలు ఒకటవ ప్రతివాది అనగా ముదుండి పెద్దిరాజు, తండ్రి: ఎం.కృష్ణంరాజుకు మంజూరు చేయటమైనది.

ఐటెమ్ నెం.1: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.653/3లోని మొత్తం ఎ.2.31 సెంట్లులో ఉత్తర మూలలో ఎ.0.23 సెంట్లు లేదా 930.81 చ॥మీ॥లు, సర్వే నెం.656లోని ఎ.2.00 సెంట్లులో ఎ.0-31 సెంట్లు జిరాయితీ పల్లం భూమి. **హద్దులు: తూర్పు:** అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్ (డి2 షెడ్యూల్-బి ఐటెమ్-2), **దక్షిణం:** సుంకర వెంకటేశ్వరరావు గారి భూమి, **పడమర:** వేగేశ్న ఈశ్వర రఘు వర్మ గారి భూమి, **ఉత్తరం:** 30 అ॥ల వెడల్పు బండి రోడ్డు

ఈ షెడ్యూల్ ఆస్తి 2వ డిఫెండెంట్ అయిన శ్రీ అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్, తండ్రి: ఎ.వెంకటేశ్వర్లు గారికి చెందినది. రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3059/2009, తేది:04-12-2009, సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, గునుపూడి, పశ్చిమగోదావరి జిల్లా ప్రకారం తనఖా పెట్టారు.

ఐటెమ్ నెం.2: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.653/3లోని మొత్తం ఎ.2.31 సెంట్లులో మధ్య భాగంలో ఎ.0.23 సెంట్లు లేదా 930.81 చ॥మీ॥లు, సర్వే నెం.656లోని ఎ.2.00 సెంట్లులో ఎ.0-31 సెంట్లు జిరాయితీ పల్లం భూమి. **హద్దులు: తూర్పు:** సుదర్శనం పురుషోత్తం ఆచార్యులు (డి3 షెడ్యూల్-సి ఐటెమ్-2), **దక్షిణం:** సుంకర వెంకటేశ్వరరావు గారి భూమి, **పడమర:** అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్ (డి2 షెడ్యూల్-బి ఐటెమ్-1), **ఉత్తరం:** 30 అ॥ల వెడల్పు బండి రోడ్డు

ఈ షెడ్యూల్ ఆస్తి 2వ డిఫెండెంట్ అయిన శ్రీ అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్, తండ్రి: ఎ.వెంకటేశ్వర్లు గారికి చెందినది. రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3060/2009, తేది:04-12-2009, సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, గునుపూడి, పశ్చిమగోదావరి జిల్లా ప్రకారం తనఖా పెట్టారు.

షెడ్యూల్-సి: 3వ ప్రతివాది అనగా సుదర్శనం పురుషోత్తమాచార్యులు, తండ్రి: ఎస్. వెంకట వరదాచార్యులు ఒరిజినల్ టైటిల్ డీడ్స్ అంటే రిజిస్టర్డ్ క్రయ దస్తావేజులు డార్జిగా ఇవ్వు నిమిత్తం కామన్ సెక్యూరిగాను మరియు గ్రూపులో ఒకరిగా గ్రూపు పేరున 8 మంది కెసిసి ఋణ సదుపాయములు తిరిగి చెల్లింపునకు సెక్యూరిటీగాను తనఖాపెట్టబడినది. 8 మంది గ్రూపు: 1.ఎ.ఎన్.వి.శ్రీనివాస్-రూ.75 లక్షలు, 2.ఎస్. పురుషోత్తమచార్యులు-రూ.74 లక్షలు, 3.యు.కనక రావు-రూ.75 లక్షలు, 4.ఎన్.ఎస్.గాంధీ-75 లక్షలు, 5. కె.ఎన్.వి.ప్రసాద్-రూ.75 లక్షలు, 6.ఎం.భాగ్యరాజు-రూ.74 లక్షలు, 7.సిహెచ్.జెన్నీ-రూ.73 లక్షలు, 8.ఎం.పెద్దిరాజు-రూ.73 లక్షలు. మొత్తం 8 కెసిసి ఋణ ఖాతాల మొత్తము సెక్యూరిటీ బాధ్యత రూ.594 లక్షలు. అందులో రూ.73 లక్షలు ఒకటవ ప్రతివాది అనగా ముదుండి పెద్దిరాజు, తండ్రి: ఎం.కృష్ణంరాజుకు మంజూరు చేయటమైనది.

ఐటెమ్ నెం.1: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.653/3లోని మొత్తం ఎ.2.31 సెంట్లులో మధ్య భాగంలో ఎ.0.23 సెంట్లు లేదా 930.81 చ॥మీ॥లు, సర్వే నెం.656లోని ఎ.2.00 సెంట్లులో ఎ.0-31 సెంట్లు జిరాయితీ పల్లం భూమి. **హద్దులు: తూర్పు:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **దక్షిణం:** 30 అ॥ల వెడల్పు బండి రోడ్డు, **పడమర:** తమద రామారావు గారి భూమి, **ఉత్తరం:** గుడెలా సత్యనారాయణ మరియు ఇతరుల భూమి

ఈ షెడ్యూల్ ఆస్తి 3వ డిఫెండెంట్ అయిన సుదర్శనం పురుషోత్తమచార్యులు, తండ్రి: ఎస్.వెంకట వరదాచార్యులు గారికి చెందినది. రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3055/2009, తేది:04-12-2009, సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, గునుపూడి, పశ్చిమగోదావరి జిల్లా ప్రకారం తనఖా పెట్టారు.

ఐటెమ్ నెం.2: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.653/3లోని మొత్తం ఎ.2.31 సెంట్లులో మధ్య భాగంలో ఎ.0.23 సెంట్లు లేదా 930.81 చ॥మీ॥లు, సర్వే నెం.656లోని ఎ.2.00 సెంట్లులో ఎ.0-31 సెంట్లు జిరాయితీ పల్లం భూమి. **హద్దులు: తూర్పు:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **దక్షిణం:** సుంకర వెంకటేశ్వరరావు గారి భూమి, **పడమర:** అద్దేపల్లి నాగ వెంకట శ్రీనివాస్ (డి2 షెడ్యూల్-బి ఐటెమ్-1), **ఉత్తరం:** 30 అ॥ల వెడల్పు బండి రోడ్డు,

ఈ షెడ్యూల్ ఆస్తి 3వ డిఫెండెంట్ అయిన సుదర్శనం పురుషోత్తమచార్యులు, తండ్రి: ఎస్.వెంకట వరదాచార్యులు గారికి చెందినది. రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3058/2009, తేది:04-12-2009, సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, గునుపూడి, పశ్చిమగోదావరి జిల్లా ప్రకారం తనఖా పెట్టారు.

(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద 10వ రోజు ఫిబ్రవరి 2023న జారీచేయబడినది)

సం/- (బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె.బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

క్లుప్తంగా

నేటి నుంచి రావిపాడు ముళ్లమ్మ ఉత్సవాలు



రావిపాడు బెండల్లంకలో పూజలందుకొంటున్న గ్రామదేవత ముళ్లమ్మ అమ్మవారు

పెంటపాడు: రావిపాడు గ్రామదేవత ముళ్లమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. బుధవారం రాత్రి అమ్మవారిని పుట్టింటికి గరగలతో ఊరేగింపు నిర్వహించారు. గురువారం సేవామహోత్సవం జరగనుంది. 4న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేయనున్నట్లు ఆలయ ట్రస్టీ బొచ్చెల తాతారావు సోదరులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



కోనా శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : హిందుధర్మాన్ని పరిక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు తెలిపారు. అలాగే సేవాభావం, ఆధ్మాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కుంచనపల్లి ద్వారకా నగర్‌లో నిర్మిస్తున్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రస్తుతం రూ. లక్ష విరాళం అందచేస్తూ భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఒబిలిశెట్టి నటరాజు, ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లికార్జునరావు, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ ఆతుకూరి పవన్‌కుమార్, కార్యదర్శి మర్రి జగదీష్, తాత నాగేశ్వరరావు, గుండు గోపాలం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పెంటపాడు: పరిసరాల శుభ్రతకు, ఆరోగ్యరక్షణకు ప్రతి ఒక్కరూ తప్పక డ్రైడే పాటించాలని, తద్వారా దోమల నియంత్రణ సాధ్యమవుతుందని గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వీ. లక్ష్మణరావు పేర్కొన్నారు. ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డా.ఎస్వీ రమణ ఆధ్వర్యంలో బుధవారం దర్శిపర్రు, బిళ్లగుంట గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియా నివారణలో భాగంగా ప్రజలు దోమల తెరలు వాడాలన్నారు. కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ మార్కండేయులు, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు ఆరోగ్యకార్యదర్శి కె. రత్నం, తేజస్విని, కాంతారావు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

పెంటపాడు: శాస్త్రవేత్తల సూచనలు, వ్యసాయాధికారుల సలహాలు పాటించడంతో పాటు, సేంద్రియ సాగు ద్వారానే జిల్లాలో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధిలు పేర్కొన్నారు. ఆకుతీగపాడు గ్రామంలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వరిపైరుపై ఆశించే తెగుళు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించకుండా ఇష్టానుసారంగా పురుగుమందులు వాడకం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పొలంబడిలో రైతుల సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, వీఏఏలు, రైతులు, వైఎస్సార్ పార్టీ నాయకులు ఆకుల శ్రీను, చింతల నాగరాజు, వీరాబత్తుల నాగ సత్యనారాయణ, జాలపర్తి నాగేశ్వరరావు, మోఖమాట్ల వీరన్న, సోమిశెట్టి శ్రీను, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బహుజన సేన సమితి గూడెం ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా వెంకటకుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): బహుజన సేన సమితి (బీఎస్ఎస్) పట్టణ ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా నేలపాటి వెంకట కుమార్‌ని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాశ్ నియమించారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో బుధవారం జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు చీలి మోహన్‌రావు అధ్యక్షత వహించారు. అనంతరం విలేకర్లతో రవిప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలోని బహుజన గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివశించే గ్రామాల్లో మౌలిక సదుపాయులు కల్పించాలన్నారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి గుంటూరు నవీన్, నియోజకవర్గం నాయకులు పెనుమాక వెంకట్రావు, దూలపల్లి సత్తయ్య, చీలి రాజు, కంకిపాటి సుబ్బారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కొంగుబంగారం మదనగోపాలుడు



అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో వేంచేసియున్న మదనగోపాలస్వామి



బల్లిపాడులో మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణం



ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్

- ఘనంగా ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు
- నేటి రాత్రి స్వామివారి కల్యాణం

అత్తిలి: జిల్లాలో గల వైష్ణవ క్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామి ఆలయం ఒకటి. ద్వారకా తిరుమల తరువాత అంతటి ప్రాశస్త్యం కల్గిన శ్రీమదనగోపాలుని కల్యాణ మహోత్సవాలను ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ద్వారకా తిరుమలలో వెంకటేశ్వరస్వామివారికి ఏవిధంగా నిత్య కైంకర్యాలు నిర్వహిస్తారో, అదేవిధంగా ఇక్కడ మదనగోపాల స్వామివారికి పూజాదికాలను జరుపుతారు. ఈనెల 27 నుంచి ప్రారంభమైన శ్రీస్వామివారి కల్యాణోత్సవాలు మార్చి 8వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తారు. మార్చి 2వ తేదీ రాత్రి 10.08 గంటలకు స్వామివారి కల్యాణం రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులచే నిర్వహిస్తారు. 3వ తేదీన స్వామివారి తీర్థ మహోత్సవం, అన్నసమారాధన, రథోత్సవం, 4న రాత్రి బాణాసంచాకాల్పులు, స్వామివారి పొన్నవాహన గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ ధనుమూరి తాతాజీ, ఈవో చందక దారబాబు తెలిపారు.

కోరిన కోర్కెలు తీర్చే మదనగోపాలుడు...

కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా మదనగోపాల స్వామి వారిని భక్తులు కొలుస్తారు. గ్రామస్తులకు స్వామివారిపై ఉన్న అచంచలమైన నమ్మకంతో శ్రీస్వామివారి పేరుతో విద్యా, వ్యాపార సంస్థలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది స్వామివారి కల్యాణోత్సవాలు పాల్గుణ మాసం అష్టమి నుంచి బహుళ పాడ్యమి వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పూర్వకాలంలో గ్రామ పెద్దలు స్వామివారిపై ఉన్న విశ్వాసంతో స్వామివారికి నిత్యధూప, దీప నైవేథ్యాలకోసం 136 ఎకరాల భూమిని విరాళంగా అందజేసారు. ఫలసాయంపై వచ్చే ఆదాయంతో స్వామివారికి నిత్యకైకర్యాలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయాభివృద్ధిలో పలువురు దాతలు భాగస్వాములు అవుతున్నారు.

ఆలయ చరిత్ర.....

1770 దశకంలో బల్లిపాడు గ్రామస్తులు పాలకొల్లు మండలం పెనువుదం గ్రామం వెళ్లి చెరువు తవ్వుచుండగా శ్రీ మదనగోపాలస్వామి వారి రాతి విగ్రహం బయటపడింది. అక్కడ నుంచి శ్రీస్వామి వారి విగ్రహం బల్లిపాడుకు తీసుకువచ్చారు. ఈ విగ్రహం గురించి తెలుసుకున్న పెనువుదం గ్రామస్తులు బల్లిపాడు వచ్చి విగ్రహం ఇమ్మని వివాదం చేయగా, ఆ పెద్దలందరికీ అతిథి మర్యాదలతో సత్కరించి, తమ గ్రామంలో ఆలయం కట్టి విగ్రహ ప్రతిష్ఠ చేసి భూములు ఏర్పాటు చేస్తావుని చెప్పి పెనువుదం గ్రామస్తులను పంపివేశారు. బల్లిపాడు గ్రామస్తులంతా ఏకమై శ్రీ స్వామివారికి 1773 సంవత్సరంలో ఆలయాన్ని నిర్మించారు. 1901వ సంవత్సరంలో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. 1970వ సంవత్సరంలో శ్రీ స్వామివారి సన్నిధిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం నిర్మించడంతో శ్రీస్వామి వారి ఆలయం దివ్య స్థలంగా వెలుగొందుతోంది. 19వ శతాబ్దం మొదటిభాగంలో ద్వారకా తిరువులలో వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ధర్మకర్తలకు, అర్చకులకు మధ్య వివాదం వచ్చినప్పుడు కొంతకాలం వెంకటేశ్వరస్వామి వారి నిత్యధూపదీప నైవేథ్యాలకు అంతరాయం కల్గింది. ఆ సమయంలో వెంకటేశ్వరస్వామి వారి అంశ ద్వారకాతిరువుల నుండి బల్లిపాడు మదనగోపాలస్వామివారిలో ప్రవేశించిందని ప్రతీతి. ఆ కారణంగానే నిత్య ఆరాధనలో శ్రీ మదనగోపాల స్వామివారికి నమోవాకములు చెప్పుచూ అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామియే నమఃఅని సంకల్పం కూడా అప్పటి నుంచి చెప్పుట ఆచారంగా వస్తుంది. ఇదియేగాక స్వామి వారిని గురించి అనేక విశ్వాసనీయమైన కథలు ప్రచారంలో ఉన్నవి. స్వామి వారిని కొలిచిన వారికి కొంగు బంగారమని భక్తులు విశ్వసిస్తారు. శ్రీ మదన గోపాలస్వామి దేవాలయంలో శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు, ఆంజనేయస్వామి ఉపాలయాలుగా ఉన్నవి. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీమదనగోపాలస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిపిస్తారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వరస్వామివారి కల్యాణం, భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణం, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, కనువు, ఉగాది, శ్రావణ శుక్రవారాలు, దేవీ నవరాత్రులు, కృష్ణాష్టమి, కార్తీకవూసం, హనుమజ్జయంతి తదితర ఉత్సవాలు ఏకాదశి ఉత్సవాలు శ్రీ స్వామివారి ఆలయంలో వైభవోపేతంగా జరుగుతాయి. ఇవేగాక దేవస్థానంచే మెరిట్ విద్యార్థులకు ష్కాలర్‌షిప్‌లు, పుస్తకాలు పంపిణీ, గ్రంథాలయ నిర్వహణ, వేసవిలో చలివేంద్రం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు దేవస్థానం నిర్వహిస్తోంది

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం



మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. గ్రామస్తులు, పోలీసుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నాం. రథోత్సవం, బాణాసంచాకాల్పులు, పొన్నవాహన గ్రామోత్సవ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం. **ధనుమూరి తాతాజీ ,ట్రస్టుబోర్డు చైర్మన్, బల్లిపాడు, అత్తిలి మండలం**

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



మదనగోపాలస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాం. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలి. .

చందక దారబాబు, కార్యనిర్వహణాధికారి, బల్లిపాడు. అత్తిలి మండలం.

ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తా



ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

తాడేపల్లిగూడెం అర్బన్: ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కావాడి శివకుమార్ ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందచేశారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కావాడి సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ముఖ్యమంత్రి జగన్‌కు అభినందనలు



అంతర్జాతీయ పద్మశాలీ సమ్మిట్‌లో వావిలాల సరళాదేవి జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులాల, అభివృద్ధి, సంక్షేమం గురించి దుబాయ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ పద్మశాలీల సమ్మిట్ సదస్సులో పలువురు పద్మశాలీ ప్రముఖులు ప్రసంశించినట్లు రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి చెప్పారు. ఫిబ్రవరి 26, 27 తేదీల్లో నాపా ఆధ్వర్యంలో దుబాయ్‌లో జరిగిన ప్రపంచ పద్మశాలీల సమ్మిట్‌లో ప్రపంచ నలుమూలల నుంచి హాజరైన పద్మశాలీ ప్రముఖులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు ఇస్తున్న రాజకీయ ప్రాధాన్యం గురించి ప్రశంసించినట్లు తెలిపారు.

తెల్లవారుజాము నుంచే పెన్షన్ల పంపిణీ



తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెంలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ



గూడెం పట్టణంలో పింఛన్లు అందజేస్తున్న కన్వీనర్ కర్రి భాస్కరరావు



ముదునూరుపాడులో వృద్ధులకు పింఛన్ అందిస్తున్న పార్టీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: అవ్వ తాతలకు ఇచ్చే పెన్షన్ డబ్బులను బుధవారం తెల్లవారుజామున మండల వ్యాప్తంగా ఆయా వలంటీర్లు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు అందజేశారు. కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లతో కలిసి పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెల్లవారుజామున పింఛను సొమ్ము అందజేశారు. మండలంలోని 27 గ్రామాల్లోనూ పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం అందజేశారు. దీంతో పింఛన్‌దారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు మాట్లాడుతూ పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ)లో : తెల్లవారుజామున పట్టణంలోని వలంటీర్లు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి పాతూరు పదో వార్డులో ఇంటింటికి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ కర్రి భాస్కర రావు మాట్లాడుతూ ప్రభుత్వం కుల, మతం, పార్టీ వర్గ భేదం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దాల నరసింహారావు, కె.శ్రీనివాసరావు, అచ్యుత శ్రీనివాసరావు, ఉమాదేవి, పెనుగొండ సత్యవతి, గొర్రెల రవి, కాకర్ల రాజీవ్, పెనుగొండ ఆంజనేయులు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పెంటపాడులో : పింఛన్ల పంపిణీ కార్యక్రమం పెంటపాడు మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది.ఆయా ప్రాంత వలంటీర్లతో పాటు ఇటీవల నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు పింఛన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. అవ్వ తాతలకు ఇచ్చే పెన్షన్ డబ్బులను బుధవారం తెల్లవారుజామున మండల వ్యాప్తంగా ఆయా వలంటీర్లు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు అందజేశారు. కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లతో కలిసి పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెల్లవారుజామున పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ముదునూరుపాడు పార్టీ కన్వీనర్, ఇన్‌చార్జ్ మేడపాటి జనార్ధనరెడ్డి మాట్లాడుతూ పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం జగనన్నకు, స్థానిక ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ద్వారంపూడి ప్రేమ్‌కిరణ్‌రెడ్డి, కర్రి రమేష్‌రెడ్డి, సత్తి వేణుపాల్ రెడ్డి, బేతిరెడ్డి దానిరెడ్డి, కర్రి రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్ సేవాసమితి సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో బుధవారం పింఛన్ల పంపిణీ వలంటీర్ల ద్వారా సక్రమంగా జరిగినట్లు ఎంపీడీవో దామోదరరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చుతున్న సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిదులు

పెంటపాడు: ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యం, ఇంటి శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రతకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలో మార్చినెల ప్రారంభం పురస్కరించుకొని జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా పలు వార్డులు శుభ్రం చేశారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు రెండు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలోని చెత్తను తొలగించి, రోడ్లు ఊడ్చారు. డ్రైయిన్‌ల్లో పూడిక తీశారు. తాగునీటిపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణల సూచనల మేరకు వారంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిరంతరాయంగా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి మాట్లాడుతూ పెంటపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో స్వచ్ఛసంకల్పం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి విజయబాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, కాసారపు శ్రీను, మారంపూడి ఏసుదాసు, చదలవాడ శ్రీనివాస్, కొలుపూరి శివ, దేవాబత్తుల వెంకన్నబాబు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ద్వారా పింఛన్లు అందించాలి



ఎల్.అగ్రహారం గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయుసీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పింఛన్లు అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎల్.అగ్రహారం, మాధవరం గ్రామాల్లో భవన నిర్మాణకార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు కొనసాగింపునకు కార్మికులు ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, గ్రామీణ ప్రాంతాల కార్మికులను సంఘటితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లంగోళ్ళ కృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, గ్రామ సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సిద్దిరెడ్డి సత్యనారాయణ, దంగేటి నారాయణరావు, ప్రధాన కార్యదర్శులు గండ్రోతు హనుమంతు, పాండు రంగారావు, కోశాధికారి ఇంటి కనకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రచయిత గోపాల్‌కు అభినందనలు

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు సుంకర గోపాల్‌కు పెన్నా అవార్డు దక్కింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. గోపాల్ విరచిత మా నాయన పాట పుస్తకానికి గాను ఈ అవార్డు దక్కడం సంతోషమని ప్రిన్సిపాల్ కొనియాడారు. గత 14 సంవత్సరాల నుంచి రచయితగా ఆయన అనేక పుస్తకాలు రాసారన్నారు. పెన్నా రచయితల సంఘం తరపున వెంకటేశ్వర యూనివర్శిటీ తెలుగు ఆచార్యులు మేడిపల్లి రవికుమార్, ప్రముఖ రచయిత మందరపు హైమావతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు పెన్నా రచయితల అవార్డు కమిటీ అధ్యక్షుడు ఎ. శ్రీదర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్‌ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మాచారి, జాన్‌బాబు, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారులకు బెల్లం విక్రయించొద్దు



బెల్లం వర్తకులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేసే వ్యక్తులకు వ్యాపారస్తులు బెల్లం విక్రయించరాదని స్పెషల్ ఎన్ఫోర్సమెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ కోరారు. ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం పట్టణంలోని బెల్లం వ్యాపారస్తులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ యు.రవిప్రకాశ్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవి కుమార్, ఏఈయస్ బార్గవ్ ఆదేశాలు మేరకు వ్యాపారస్తులతో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఎవరికైనా అధిక మొత్తంలో బెల్లం అడిగితే వారి నుంచి సరైన ధ్రువ పత్రాలు కాపీలు తీసుకొని అమ్మాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, వ్యాపారం చేయని వారు ఐదు కేజీలపైన బెల్లం కొనుగోలు చేస్తే వారి సమాచారం ఆధార్‌కార్డు, అడ్రస్, ఫోన్ నెంబర్లు తీసుకోవాలని, వాటిని తమకు అందించాలని సూచించారు. వ్యాపారస్తులు కట్టడి చేస్తే నాటుసారా తయారీ నిలిచిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిరణా మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, ఉపాధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి, బెల్లం వర్తకులు, ఎస్ఈబీ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీకి మాదిగల సత్తా చూపిద్దాం



అంబేద్కర్ విగ్రహం వద్ద పాదయాత్రలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గెద్ద దించి మాదిగల సత్తా చూపిద్దామని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. మాదిగ మహాసంగ్రహ పాదయాత్ర బుధవారం పట్టణంలో నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాదిగ మాట్లాడుతూ 22 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో మాదిగ బిడ్డలు అనేక మంది అమరులు అయ్యారన్నారు. దేశ వ్యాప్తంగా మార్చి 1వ తేదీన మాదిగ మృతవీరుల సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమరుల ఆశయాల సాధనకు ఎంఆర్‌పీఎస్ కృషి చేస్తుందని వెల్లడించారు. బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి 9 ఏళ్లు గడుస్తున్న వర్గీకరణ ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. తఅతి త్వరలోనే వర్గీకరణ సాధించుకునేందుకు ఉద్యమాలు చేస్తామన్నారు. నాయకులు పాదయాత్రగా ఉంగుటూరు నియోజకవర్గానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చెప్పుల వాసు, మహాజన సోషలిస్ట్ పార్టీ సమన్వయకర్తలు రాజేశ్వరరావు, చిన్నబాబు, ఎంఆర్‌పీఎస్ నాయకులు బొల్లిపో రత్నజీ, శీలి వెంకటాచలం , మెరిపో సంతోషరావు, గాలింకి ప్రేమకుమార్, ముప్పిడి రమేష్, దూలపల్లి శ్రీను, ఉండ్రాజవరపు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోండి



మహాసభలో మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ విజ్ఞప్తి చేశారు. ఇఫ్టూ తాడేపల్లిగూడెం డివిజన్ మహాసభ బుధవారం పట్టణంలోని షాదిఖానాలో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అన్ని రకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యుడు బతికేందుకు కష్టంగా మారిందన్నారు. పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు తగ్గించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక:

మూడు సంవత్సరాల కాల పరిమితికిగాను నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. గూడెం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మామిడి దాన వర ప్రసాద్, అధ్యక్షులు కుందేటి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తులా దుర్గారావు, మంచాల సత్తిపండు, సహాయ కార్యదర్శిగా రెక్క గిరి వర ప్రసాద్, బి.ఉదయరాజు, కోశాధికారిగా పామర్తి జాన్, సభ్యులుగా కోట సత్యనారాయణ, వడగల శ్రీను, పాలూరి హరి, జి.కోటేశ్వరరావు, ఎం.నాగేంద్ర, వీరబాబు, పి.ప్రసాద్, దుర్గాప్రసాద్, రత్నం, రామంజమ్మ, పరసా లక్ష్మి, శివ ప్రసాద్, డి.వెంకట్రావు, నరేంద్రనాథ్‌లు ఎన్నికయ్యరు. వివిధ రంగాల కార్మికులు 300 మంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలి

తణుకు టౌన్: మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి తెలిపారు. తణుకు పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో అమలవుతన్న మధ్యాహ్న భోజన పథకాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. పట్టణ బీజేపీ నాయకులు అవినాష్ కాంత్ పాల్గొన్నారు.